క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన సూదిన హరిశ్రీ–వెంకటరమణి దంపతులు రూ.10 వేల విరాళం అందించినట్లు ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య తెలిపారు. దాతలకు ఆలయ ఈఓ చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.

దేశభక్తి కలిగి ఉండాలి



నగరంలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ దేశభక్తితో ముందుకు సాగాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సూచించారు. నగరంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో విక్రయిస్తున్న జాతీయ జెండాను ఎమ్మెల్యే ఆదివారం ఆవిష్కరించారు. కేవలం రూ.25లకు పోస్టాఫీసుల్లో జాతీయ జెండాను విక్రయిస్తున్నామని రాజోలు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ జె.వేణు తెలిపారు. కార్యక్రమంలో కొండేటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాజేశ్వర స్వామికి రుద్రాభిషేకం

అంబాజీపేట: మాచవరంలో వేంచేసిన పార్వతీ సమేత రాజేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మాచరి రాజి ఆధ్వర్యంలో స్వామికి వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వాడపల్లిలో అష్టోత్తర పూజలు



స్వామికి అష్టోత్తర పూజలు చేస్తున్న భక్తులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారి అష్టోత్తర పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవాచనం తదితర పూజలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామి వారి అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు తమ కోర్కెలు నెరవేరడంతో స్వామి వారి అష్టోత్తర పూజల్లో అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు.

ఘనంగా బాలగణపతి వార్షికోత్సవం

అంబాజీపేట: స్థానిక సత్యసాయినగర్‌లో వర్కింగ్ కమిటీ ఆధ్వర్యంలో బాలగణపతి స్వామి వారి మొదటి వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఆదివాకం ఘనంగా నిర్వహించారు. పెదమల్లు శ్రీనివాస వెర్రియ్య గుప్తా–శశికళ దంపతులతో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మజ్లిస్ ఆలపిస్తూ గుమ్మటం ఊరేగింపు



మామిడికుదురులో గుమ్మటాన్ని ఊరేగిస్తున్న ముస్లింలు

మామిడికుదురు: మొహరం సంతాప దినాల్లో భాగంగా నగరం, మొగలికుదురు, మామిడికుదురు గ్రామాల్లో ఆదివారం మజ్లిస్ ఆలపిస్తూ గుమ్మటాలను ఊరేగించారు. ముస్లింల ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ హుసేన్ తనయుడు హిమామ్ జయునుల్ అబేదిన్ వీర మరణం పొందిన సంఘటనలను మరణిస్తూ ఈ కార్యక్రమాలను నిర్వహించారు. మొగలికుదురు పెదపంజీషాతో పాటు మామిడికుదురు హిమామ్ అలీరజా పంజాల్లో కార్యక్రమాలు జరిగాయి.

బాలబాలాజీ స్వామికి రూ.1.43 లక్షల ఆదాయం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి ఆదివారం వివిధ సేవల ద్వారా రూ.1.43 లక్షల ఆదాయం వచ్చింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టికెట్ల ద్వారా రూ.1.08 లక్షల ఆదాయం రాగా, నిత్యాన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.35,650లు విరాళంగా అందించారు. మొత్తం 2,374 మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. 1,685 మంది భక్తులు స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ జి.మాధవి తెలిపారు.

సంక్షేమ పథకాల సారథులకు ఆర్థిక భరోసా

ఎమ్మెల్యే చిట్టిబాబు



అంబాజీపేటలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రభుత్వ ఆశయాలకు, పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న మండల జేసీఎస్, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు వైఎస్సార్ సీపీ ఆర్థిక భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చెప్పారు. అంబాజీపేట వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ మండల జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితో జగనన్నే మా భవిష్యత్, జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష కార్యక్రమాలను నియోజకవర్గంలో దిగ్విజయంగా పూర్తి చేశామన్నారు. ఈ నెల 13 నుంచి 17 వరకు మండల జేసీఎస్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల కోసం ఉచిత బీమా పథకం నిర్వహిస్తున్నారన్నారు. పి.గన్నవరం మండలం చాకలిపాలెం లో ఉన్న బాలాజీ కన్వర్షన్ హాల్లో రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఈ నెల 16న చేపడతామన్నారు. ఆగస్టు 18 నుంచి సెప్టెంబర్ 10 వరకు నియోజకవర్గంలోని 75 గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. నియోజకవర్గంలోని అంబాజీపేట, పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి మండలాల్లోని 75 గ్రామ సచివాలయాల్లో నలుగురు మండల జేసీఎస్ కన్వీనర్లు, 225 సచివాలయ కన్వీనర్లు, 4284 గృహసారథులు ఉన్నారని తెలిపారు. నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 74 గ్రామ సచివాలయాల పరిధిలో పూర్తి చేశామని, మిగిలిన గంటి పెదపూడి గ్రామ సచివాలయంలో పూర్తి చేయాల్సి ఉందన్నారు. ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు, మండలానికి రూ.60 లక్షలు ప్రభుత్వం సమకూర్చిందన్నారు. గోదావరి నదీ పరీవాహక ప్రాంత గ్రామాల్లోని ఆర్అండ్‌బీ పంచాయతీ రహదారుల నిర్మాణాన్ని రూ.8 కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. సొంతంగా నిర్మించు కొనే ఇళ్లతో పాటు, లబ్ధిదారులు నిర్మించుకొనే ఇళ్లకు రూ.1.80 లక్షల వంతున 10 వేల ఇళ్లకు మంజూరు చేస్తున్నామన్నారు. నూతనంగా మంజూరు చేసిన రేషన్ కార్డులను ఆగస్టు15 దాటిన తరువాత పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్లు దొమ్మేటి సత్యమోహన్, దొమ్మేటి దుర్గారావు, జక్కంపూడి వాసు, పులిదిండి ప్రభాకరరావు, ఏఎంసీ చైర్మన్ వైస్ చైర్మన్‌లు వేటుకూరి వెంకట్రాజు, నాగవరపు నాగరాజు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, వాసంశెట్టి చినబాబు, ముత్తాబత్తుల ప్రశాంత్ పాల్గొన్నారు.

గల్ఫ్ ఎన్నారైల సేవలు అభినందనీయం



ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: కువైట్ కేంద్రంగా పనిచేస్తున్న గల్ఫ్ గృహ కార్మికుల హెల్పింగ్ హ్యాండ్స్, ఎన్నారై సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ అన్నారు. గల్ఫ్ గృహ ఎన్నారై సంస్థ మూడో వార్షికోత్సవం సందర్భంగా మలికిపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నిస్సహాయులకు ఈ సంస్థ ఆర్థికపరంగా చేయూతనివ్వడం సంతోషకరమన్నారు. ఎన్నారై సంస్థ వ్యవస్థాపకుడు తెన్నేటి ఫిలిప్ అతని బృంద సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. ఎన్నారై సంస్థ ఇండియా టీం ప్రోగ్రామ్స్ సమన్వయకర్త నల్లి ప్రసాదరావు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుంచి ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో అనేక మందికి రూ.10 లక్షల వరకు ఈ సంస్థ ద్వారా ఆర్థిక సహాయం అందించడం జరిగిందని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేయాలని నిర్ణయించామన్నారు. మలికిపురం గ్రామానికి చెందిన దేవవరపు సూర్యకుమారికి రూ.23 వేల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. అలాగే తురక సావరానికి చెందిన కడలి లక్ష్మీప్రసన్నకు రూ.ఐదు వేలను గెడ్డం తులసీ భాస్కర్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో సంస్థ ఇండియా టీం ప్రోగ్రామ్స్ సమన్వయకర్త నల్లి ప్రసాదరావు, నక్కా రామారావు, కోళ్ల వేణు, కొల్లాబత్తుల అశోక్, రాపాక చిన్ని, పాలపర్తి శేఖర్, నల్లి మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

స్వామి సన్నిధిలో అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి



జడ్జి రాజీవ్‌కు స్వామి చిత్రపటం ఇస్తున్న ఆలయ సిబ్బంది

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆదివారం రాజమహేంద్రవరం అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి పీఆర్ రాజీవ్ కుటుంబ సమేతంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం ప్రధాన అర్చకుడు శ్రీనివాస్ కిరణ్, స్థానాచార్య రామరంగాచార్యులు, వేదపండితుడు వేంకట శాస్త్రి, అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. స్వామి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ సిబ్బంది జడ్జి రాజీవ్‌కు అందజేశారు.

పురంధేశ్వరికి పెన్నుల స్టాండ్ బహూకరణ



పురంధేశ్వరికి కొబ్బరిపీచుతో తయారు చేసిన పెన్నుల స్టాండ్‌ను బహూకరిస్తున్న గంగాధరం

మామిడికుదురు: రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరికి బీజేపీ యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కటికిరెడ్డి గంగాధరం కొబ్బరి పీచుతో తయారు చేసిన పెన్నుల స్టాండ్‌ను బహూకరించారు. ఆదివారం ఆయన పురంధేశ్వరిని విజయవాడలో మర్యాద పూరకంగా కలిశారు. కొబ్బరి పీచుతో వివిధ రకాల ఉత్పత్తులను, బొమ్మలను తయారు చేస్తున్నారని గంగాధరం పురంధేశ్వరికి వివరించారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, వాటికి మార్కెటింగ్ సదుపాయం కల్పించేలా కృషి చేయాలని ఆమెను కోరారు.

దాతల సహకారం ఎంతో విలువైనది

అంబాజీపేట: హెచ్ఐవీ రోగులకు దాతలు అందిస్తున్న సహకారం ఎంతో విలువైనదని దానిని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ జల్లి బాలరాజు, రెడ్‌క్రాస్ సంస్థ వైస్ చైర్మన్ నెన్నమరాజు వెంకటపతిరాజు, డాక్టర్ పీఎస్ శర్మ అన్నారు. పుల్లేటికుర్రులో బెహరా హనుమంతరావు అధ్యక్షతన అమలాపురం ఇండియన్ రెడ్‌క్రాస్, వైఆర్‌జీ కేర్ సంస్థల ఆధ్వర్యంలో హెచ్ఐవీ రోగులకు పౌష్టికాహారాన్ని ఆదివారం పంపిణీ చేశారు. వరిగేటి బాలరాజు, బీర సందీప్, బీవీ హనుమంతరావు, లక్కింశెట్టి భాస్కరరావు, బీర విమల పుష్కరుడు దాతలు సమకూర్చిన రూ.పది వేలు విలువైన 8 రకాల పౌష్టికాహారం కిట్లను 50 మందికి హెచ్ఐవీ బాధిత చిన్నారులకు, మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో అమలాపురం సామాజిక సేవకురాలు జల్లి సుజాత, ఏడుకొండలు, రమణి పాల్గొన్నారు.

'మొల్లేటి'ని తొలగించాలి



మామిడికుదురు టీడీపీ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మామిడికుదురు: టీడీపీలో నెలకొన్న అంతర్గత విభేదాలు ముదిరి పాకాన పడ్డాయి. జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబుకు వ్యతిరేకంగా ఒక వర్గం సమావేశం ఏర్పాటు చేసింది. దానికి ప్రతిగా మండల పార్టీ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాసును అధ్యక్ష పదవి నుంచి తొలగించాలంటూ మరో ఒక వర్గం పోటీ సమావేశం ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్ కుల రాజకీయాలను ప్రోత్సహిస్తూ పార్టీకి చేటు చేస్తున్నారంటూ ఆదివారం మామిడికుదురు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక భవనంలో జరిగిన సమావేశంలో పార్టీ నేతలు వాపోయారు. అతడిని అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని బీసీ నేత కొండా జగదీశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశం డిమాండ్ చేసింది. మొగలికుదురులో జరిగిన సమావేశంలో నామన రాంబాబు సక్రమంగానే వ్యవహరించారని మండల పార్టీ అధ్యక్షుడుకు ఏ విధమైన అవమానం జరగలేదన్నారు. సమావేశంలో సూదా బాబ్జి, వడ్డినేని వెంకటరామయ్య, మాల్లాది విష్ణు, సుందరనీడి చిన్ని, కొమ్ముల నందుబాబు, కోలా రాంబాబు, ఒంట్రు శ్రీరామారావు, బొంతు భాస్కరరావు, రేలంగి బాపూజీ పాల్గొన్నారు.

డాక్టర్ ప్రతాప్‌కు సత్కారం

సఖినేటిపల్లి: మండలానికి చెందిన శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌ను, సత్యసాయి జిల్లాలో శనివారం రాత్రి కవులు, కళాకారులు ఘనంగా సత్కరించారు. వివరాలను ఆదివారం ప్రతాప్ మీడియాకు తెలిపారు. సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం మరువ కొత్తపల్లి విరాజ్ ప్యాలెస్‌లో నిర్వహించిన జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో భాగంగా లేపాక్షి కవితా వైభవం కార్యక్రమంలో ఎంపీపీ పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో ప్రతాప్‌ను సత్కరించారు. ప్రతాప్ కొనసాగిస్తున్న సాహిత్య సేవలకు గుర్తింపుగా పై సత్కారం చేశారు. కాగా ప్రపంచ సాహిత్య చరిత్రలో 122 జాతీయ శతాధిక కవి సమ్మేళనాలు నిర్వహించిన ఘనత ప్రతాప్‌కు దక్కిందని ఎంపీపీ ప్రశంసించారు. కళావేదిక, ఏపీ రాష్ట్ర యవజన విభాగం మరువ కొత్తపల్లి జిల్లా శాఖ పర్యవేక్షణలో డాక్టర్ ప్రతాప్ నేతృత్వంలో వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన కవులతో జాతీయ శతాధిక కవి సమ్మేళనం ఏర్పాటు చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులు



బిళ్లకుర్రులో విత్తనాల కిట్స్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ గంగాధరరావు, జెడ్పీటీసీ రమాదేవి

కొత్తపేట: ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన, ఆహార ఉత్పత్తులు పండించాలని ఎంపీపీ మార్గన గంగాధరరావు రైతులకు సూచించారు. ప్రకృతి వ్యవసాయం వానపల్లి యూనిట్ ఆధ్వర్యంలో బిళ్లకుర్రులో శనివారం ప్రధానమంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ యోజన (పీఎంఏజేఏవై) పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయ చేస్తున్న షెడ్యూల్డ్ కులాల రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 12 రకాల నవధాన్యాలు, చిరుధాన్యాలు, 10 రకాల కూరగాయల విత్తనాలు పంపిణీ, ఇతర రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ నెల్లి లక్ష్మీపతిరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎంపీపీ గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. యూనిట్ ఇన్‌చార్జ్ వెంకటేశ్వరరావు ప్రకృతి వ్యవసాయం గురించి వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయానికి వివిధ ప్రోత్సాహకాలు అందిస్తున్నాయన్నారు. బిళ్లకుర్రు పంచాయతీ పరిధిలో సుమారు 400 ఎకరాలు గుర్తించినట్టు తెలిపారు. బిళ్లకుర్రు యూనిట్ పరిధిలో 30 (300 కేజీలు) విత్తనాలు కిట్స్ రాగా 30 మంది రైతులకు ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మంగిపూడి శ్రీరామచంద్రమూర్తి, ఫార్మర్ సైంటిస్టు కముజు అరుణకుమారి, ఐసీఆర్‌పీలు యెలిశెట్టి వెంకటేశ్వరరావు, డి.శ్రీలక్ష్మి, కె.కళ్యాణి, ఎం.సునీత, కె.అనితకుమారి, ఎస్.సత్యకుమార్, రైతులు పాల్గొన్నారు.

చురుగ్గా కమ్యూనిటీ హాలు పనులు

ఆలమూరు: గ్రామంలోని పెద్ద కాలువ రోడ్డులో సుమారు రూ.కోటి వ్యయంతో నిర్మిస్తున్న శెట్టిబలిజ కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సమకూర్చిన 50 సెంట్ల భూమిలో జరుగుతున్న పునాది పనులను శెట్టిబలిజ నాయకులు ఆదివారం పరిశీలించారు.

టీడీపీ మహాశక్తి చైతన్య యాత్ర

కొత్తపేట: భవిష్యత్‌కు గ్యారంటీలో భాగంగా ఆదివారం మండలంలోని బిళ్లకుర్రులో టీడీపీ మహాశక్తి చైతన్య రథయాత్ర కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మహిళలలో కలసి ఇంటింటా తిరుగుతూ మహిళా శక్తి పథకాలను వివరించారు.

వార్డు ఉప ఎన్నికను బహిష్కరిస్తాం

అంబాజీపేట: మాచవరం గ్రామ పంచాయతీ 13వ వార్డు ఉప ఎన్నికను బహిష్కరిస్తామని ఆ వార్డు ఎస్సీ మాల వర్గీయులు హెచ్చరించారు. 13వ వార్డు పరిధిలోని పోతాయిలంక శివారు పాముల రావిచెట్టు సెంటర్లో ఎస్సీ వర్గీయులు ఆదివారం సాయంత్రం సమావేశమయ్యారు. 13వ వార్డు సభ్యుడిగా ఎన్నికైన పెచ్చెట్టి రాజు అకాలంగా మృతి చెందడంతో ఆ వార్డు (అన్ రిజర్వ్)కు ఉప ఎన్నిక అనివార్యమైంది. ఉప ఎన్నికలో మృతి చెందిన వార్డు సభ్యుడి భార్యను ఏకగ్రీవంగా వార్డు సభ్యురాలిగా చేయాలని పార్టీలకతీతంగా కొన్ని వర్గాలు ప్రయత్నాలు చేయగా ఆ వార్డుకు చెందిన ఎస్సీ వర్గీయులు కూడా పూర్తిగా సమర్థించడంతో ఆమె నామినేషన్ వేశారన్నారు. అయితే అదే సామాజిక వర్గానికి చెందిన మరో వ్యక్తి నామినేషన్ వేయడంతో ఎస్సీ వర్గీయులు ఎదురుతిరిగారు. గతంలో జరిగిన కోనసీమ జిల్లా అల్లర్లలో జిల్లాకు అంబేడ్కర్ పేరు పెట్టవద్దని వ్యతిరేకించిన వారికి ఓటు వేయమని, ఈ ఉప ఎన్నికను బహిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో 13వ వార్డు ఎస్సీ వర్గీయులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ జలకం

అంబాజీపేట: నందంపూడిలో వేంచేసిన ముత్యాలమ్మ అమ్మవారి జాతరలో భాగంగా ఆదివారం అమ్మవారి జలకాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారి పూజ ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారి పూజ ఘటాలకు గ్రామ ఆడపడుచులు ముడుపులు, మొక్కులు, చలివిడి పానకాలు చెల్లించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్ద మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గడ్డివామి దగ్ధం

రావులపాలెం: మండలంలో లక్ష్మీపోలవరంలో పంటచేలు సమీపాన ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డివామి దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గుర్తుతెలియని వ్యక్తులు కాల్చిపడేసిన చుట్టతో గడ్డిమేటుకు నిప్పంటుకుంది. దీంతో స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించగా ఫలితం లేకపోవడంతో సమాచారం అందుకున్న కొత్తపేట అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన తలపాకుల యేసుబాబుకు చెందిన పది ఎకరాల గడ్డివామికి మంటలు అంటుకున్నాయని అయితే ర. 80 వేలు విలువ చేసే గడ్డిలో సగం వరకు కాలిపోగా రూ.40 వేలు ఆస్తి నష్టం వాటిల్లిందని లీడింగ్ ఫైర్‌మేన్ రాంప్రసాద్ తెలిపారు.

అసోసియేషన్ సేవలు వెలకట్టలేనివి



అగ్నిప్రమాద బాధితుడికి సాయం అందజేస్తున్న ఏపీ ఎస్సీ వెల్ఫేర్ సభ్యులు

అయినవిల్లి: ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం అయినవిల్లి మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్.మూలపాలెంలో అగ్ని ప్రమాదానికి గురైన యాళ్ల సత్తిబాబు కుటుంబానికి నిత్యావసరాలు, బట్టలు, వంట సామగ్రి, బియ్యం, కిరాణా సామగ్రిని అందించారు. ఎస్సీ వెల్ఫేర్ అధ్యక్షుడు జె.బీమారావు గారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొబ్బా ప్రభాత్‌కుమార్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం అయినవిల్లి మండల శాఖ సేవలు వెలకట్టలేనివని అన్నారు. గతంలో కూడా గ్రామంలో అగ్ని ప్రమాద బాధితులకు సహాయ సహకారాలు అందించారని అన్నారు. కార్యక్రమంలో అయినవిల్లి సర్పంచ్ కాకర శ్రీనివాసరావు పాల్గొని సంక్షేమ సంఘం సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు, ఉపాధ్యక్షులు నేరేడుమిల్లి సత్యనారాయణ, సంఘ గౌరవ అధ్యక్షుడు వార నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వార సునీల్ కుమార్, ఆర్థిక కార్యదర్శి గుమ్మడి వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని అందరూ అనుసరించాలి



కొత్తపేట జనజాగరణ సదస్సులో మాట్లాడుతున్న బీజేపీ నేత పాలూరి

కొత్తపేట: హిందూ ధర్మాన్ని అందరూ అనుసరించాలని బీజేపీ స్వచ్ఛభారత్ రాష్ట్ర కన్వీనర్ పాలూరి సత్యానందం, ఆర్ఎస్ఎస్ బౌద్ధ ప్రముఖ్ తొగరు సీతారామాంజనేయులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక గ్రామ దేవత బంగారమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఆర్ఎస్ఎస్ హిందూ జనజాగరణ సదస్సు నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ విశ్వ హిందూ పరిషత్ ఆలయాలు, అర్చక సమాఖ్య జిల్లా ప్రముఖ్ కోటిపల్లి వెంకటసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సత్యానందం, ఆంజనేయులు, మండల బీజేపీ అధ్యక్షుడు పాలాటి మాధవస్వామి పాల్గొన్నారు. వారు పిల్లలు, పెద్దలు, హిందూ బంధువులకు హైందవ ధర్మం, సంస్కృతి, సాంప్రదాయాల గురించి వివరించారు. హిందూ ధర్మమే భారతదేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా నిలిపిందన్నారు. ఆధ్యాత్మిక భక్తిని, మానసిక తృప్తిని, శారీరక ఆరోగ్యాన్ని, తద్వారా జీవితాన్ని సార్థకం చేసుకునే ఏకైక మార్గం హిందూ ధర్మం అని అన్నారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, హిందూ బంధువులు, బాలలు పాల్గొన్నారు.

స్నేహితుల ఆర్థిక సాయం

రాజోలు: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చింతా అరుణ్ బోస్ కుటుంబానికి ఆయన స్నేహితులు, గల్ఫ్ యువనేస్తం సేవా సమితి సభ్యులు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. అరుణ్ బోస్ స్నేహితులు రూ.60 వేలు, గల్ఫ్ యువనేస్తం సేవా సమితి సభ్యులు రూ.20 వేలు అందజేశారు. గ్రామ పెద్దలు కుసుమ రాజ్‌కుమార్, గుబ్బల శ్రీనివాస్, కుడిపూడి వెంకటేశ్వరరావు, చెల్లుబోయిన హరీష్, కడలి శ్రీనివాస్‌గణపతి, దాకే ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేశాం



మగటపల్లిలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మామిడికుదురు: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీనీ అమలు చేశామని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మగటపల్లిలో ఆదివారం జరిగింది. ఎమ్మెల్యే వరప్రసాదరావు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలను ఓట్లు అడిగే హక్కు కేవలం వైఎస్సార్ సీపీకి మాత్రమే ఉందన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా సీఎం జగన్ ప్రజలకు ఇచ్చిన మాట తప్పలేదు, మడమ తిప్పలేదని రాపాక పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి భగవాన్, నాయకులు సూరిశెట్టి బాబి, కుసుమ శ్రీధర్, బండారు పండు, వేలంగి గంగాధర్, కలిగితి రామకృష్ణ, కుసుమ పెరుమాళ్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు 96 మంది విద్యార్థులు



ఇంటర్వ్యూకు హాజరైన కొత్తపేట విద్యార్థులు

కొత్తపేట: డిగ్రీ పూర్తయిన విద్యార్థులకు రాజమహేంద్రవరంలో నిర్వహించిన మహా జాబ్‌మేళాకు స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి 96 మంది విద్యార్థులు హాజరైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు తెలిపారు. చదువుకున్న ప్రతి విద్యార్థికి ఆ చదువుకు తగ్గ ఉద్యోగం కల్పించాలనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యాన్ని అనుసరించి రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు శనివారం రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల (అటానమస్), తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (నోడల్ రిసోర్స్ సెంటర్స్) పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ పూర్తయిన విద్యార్థులకు మహా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు, వైస్ ప్రిన్సిపాల్, ప్లేస్మెంట్ ఆఫీసర్ టి.రమాదేవి, అధ్యాపక బృందం ఆధ్వర్యంలో 96 మంది విద్యార్థులు హాజరయ్యారు. దేశ వ్యాప్తంగా అనేక కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఎంపికైన విద్యార్థులకు రెండు, మూడు రోజుల్లో నియామక పత్రాలు అందజేస్తామని ఆయా కంపెనీల హెచ్ఆర్‌ఓలు తెలిపినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు తెలిపారు.

మన ఆంధ్రా.. మన ఏపీఎల్ 3కే రన్



అంబాజీపేటలో 3కే రన్‌ను నిర్వహిస్తున్న క్రికెట్ క్రీడాకారులు

అంబాజీపేట: మన ఆంధ్రా.. మన ఏపీఎల్ సీజన్–2ను పురస్కరించుకుని ఓ లెవెల్ క్రికెట్ కోచ్ మట్టా సత్తిబాబు ఆధ్వర్యంలో అంబాజీపేటలో 3కే రన్‌ను ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు ఎస్.వెంకటేశ్వరరావు టార్చ్‌ను వెలిగించి ఈ రన్‌ను ప్రారంభించారు. కోచ్ సత్తిబాబు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఐపీఎల్, ఏపీఎల్‌కు క్రికెట్ క్రీడాకారులను తయారు చేయడమే కోనసీమ సబ్ సెంటర్ క్రికెట్ కోచింగ్ ప్రధాన లక్ష్యమన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో వైజాగ్‌లో ఈ నెల 16 నుంచి 27వ తేదీ వరకు ఆంధ్రా ప్రీమియర్ లీగ్ సీజన్–2ను నిర్వహిస్తున్నట్లు సత్తిబాబు తెలిపారు. అంతకుముందు స్థానిక జెడ్పీ హైస్కూల్ నుంచి ప్రారంభమైన 3కే రన్‌ను స్థానిక నాలుగు రోడ్ల సెంటర్ వరకు సాగింది. కార్యక్రమంలో కొర్లపాటి వెంకటేశ్వరరావు, క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు.

'రైతు నేస్తం'తో ఆర్థిక భరోసా

అంబాజీపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన రైతు నేస్తం పథకం ద్వారా రైతన్నలు ఆర్థిక పురోభివృద్ధి చెందేందుకు భరోసా కలుగుతుందని సొసైటీ చైర్మన్ దొమ్మేటి సత్యమోహన్ ఆదివారం చెప్పారు. రైతునేస్తం పథకం ద్వారా సంఘ సభ్యులకు ఎకరాకు రూ.8 లక్షల రుణాన్ని 12 శాతం వడ్డీతో పదేళ్ల కాల పరిమితికి డీసీసీబీ ద్వారా అందిస్తున్నామన్నారు. గరిష్టంగా రూ.20 లక్షల వరకూ రుణం పొందవచ్చన్నారు. ఈ పథకాన్ని సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకుని సొసైటీ అభివృద్ధితో పాటు, రైతులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి సహకరించాలన్నారు. సొసైటీ సీఈఓ కుంపట్ల అయ్యప్పనాయుడు మాట్లాడుతూ అంబాజీపేట సహకార సంఘంలో 1150 సభ్యులున్నారని, వీరిలో 650 మంది సభ్యులు పంట రుణాలు, మధ్యకాలిక, దీర్ఘకాలిక రుణాలు పొందారన్నారు. సంఘం ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సరఫరా చేస్తున్నామన్నారు. ఆర్బీకేలకు సపోర్టింగ్ ఏజెన్సీగా ఉంటూ రబీ, ఖరీఫ్ సీజన్లలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. జేఎల్జీ గ్రూపుల్లో ఒక్కో గ్రూపునకు రూ.లక్ష రుణసౌకర్యం, సేవింగ్స్, రికరింగ్ డిపాజిట్ అకౌంట్ ద్వారా పొదుపు చేసుకునే సదుపాయం, సంఘ సభ్యులకు లాకర్ సదుపాయం, ప్రభుత్వం నిర్ణయించి ధరలకే మీ సేవ ద్వారా ప్రభుత్వ సేవ, తక్కువ వడ్డీకే బంగారు నగల హామీపై రుణాల సదుపాయం కల్పిస్తున్నామన్నారు.